
కథ

# గుడిమీద బొమ్మ

కోటపల్లి ఈశ్వర్



ఎత్తయిన కొండ ప్రదేశంలో అపురూపంగా మలచబడి ఉందా ఆలయం.
గుడి మెట్లమీద రాలిన పున్నాగపూల నుండి వస్తున్న మత్తయిన వాసన నిశ్శబ్దంగా పరుచు కుంటోంది – ఆ ప్రాంతమంతా.
పచ్చగన్నేరు చెట్టునిండా విరగబూసిన పూలు బంగారు ముద్దల్లా మెరిసిపోతున్నాయ్.
మెట్లకు ఎడం పక్కగా వున్న కోనేట్లో నీళ్లు – ఉదయపు ఎండపడి – కరిగించిన వెండిలా తళతళ మంటున్నాయి?
అర్చన ముగించుకుని గుడి, ఆవరణలో వున్న పొగడచెట్టు మొదట్లో కూర్చున్నాడు మనోహర్. అతను పూజారి కోసం ఎదురు చూస్తున్నాడు. పన్నెండుకల్లా గుడి మూసేసివచ్చి – అతని సందేహాలకు సమాధానం చెబుతానన్నాడు పూజారి.
అందుకే ఆ నిరీక్షణ. పూజారి ఇంకా రాలేదు. ఏమీతోచని మనోహర్ – గుడిగోడల మీది తరుణీమణుల భంగిమలు చూస్తున్నాడు.

అతని కళ్లు ఓ శిల్పాన్ని చూసి తళక్కుమన్నాయ్.

శ్రీకృష్ణుని గాఢ పరిష్వంగంలో తనువు కాగి, కరిగిపోతుంటే – పారవశ్యంతో కళ్లు అరమోడ్చి, పులకించిపోతున్న రాధ శిల్పమది.

''వారెవ్వా...''

దేవుడ్ని కీర్తించే శ్లోకాల్లోనే కాదు. గుడి గోడల మీద కూడా శృంగారమే!

ఎంత మనోజ్ఞమైన తన్మయత్వపు రతి భంగిమ!

అతని చూపులు అలా అలా గోడ మీద పాకుతున్నాయ్.

మరోచోట శ్రీకృష్ణుడు మైమరచి వేణువు ఊదుతున్నాడు. ఆ సుందరాకారుని చుట్టూ చేరి, మోహంతో తాదాత్మ్యను చెందుతున్నారు గోపికలు.

ఒక స్త్రీ పయ్యెద పూర్తిగా తొలగిపోగా, మరొక వనిత నాభీమండలం మధు కలశంలా ఊరిస్తోంది. వేరొక గోపిక జఘనభాగం కళ్లు మిరుమిట్లు గొలుపుతోంది. ఇంకొక గోప వధువు కటివలయం నుంచి వలువ నిలువ లేక జారిపోతోంది.... మరొక మోహనాంగి సమోన్నత వక్ష స్థలం చూపరుల మతి పోగొడుతోంది.

''ఆ హాహా... కల వేణు రవావశ గోపవధూ... శత కోటి వృతాత్సర కోటి సమాతో...''

అనుకోకుండా అతడి అధరాల్నుంచి అలవోకగా వచ్చేసిందా శ్లోక పాదం.

''నాయనా... మనోహర ... ఇక అడుగు... నీ సందేహాలు'' మాధవశాస్త్రి వచ్చి మనోహర్ ఎదురుగా కూర్చున్నాడు.

గోపికల అంగాంగ విన్యాసాల్ని విచలితుడై వీక్షిస్తున్న మనోహర్ ఈ లోకంలోకి వచ్చాడు.

''నాయనా... మనోహరా...'' అంటూ మాధవ శాస్త్రి సంబోధించిన విధానం – అతనికెందుకో గిలిగింతలు పెట్టినట్లనిపించింది.

''మనోహర్ అంటే ఏమిటి పూజారిగారూ?'' అర్థం తెలిసినా – కావాలనే అడిగాడు.

''మనసులను హరించే వాడు అని అర్థం నాయనా...''

''ఎవరి మనసులనండీ?''

''కన్యామణుల మనస్సులను! భగవాన్ శ్రీకృష్ణుడు బృందావనంలో విహరిస్తూ, గోపికల హృదయాలను దోచే వాడు, కనుక మనోహరా... అని ఆయన్ని కీర్తించారు కవులు..''

''మన కవులు మంచి రసికులండీ''

''శృంగారంలో దైవత్వం ఉంది బాబు...''

''ఎంతబాగా చెప్పారండి... మీరు చాలానచ్చారు నాకు... గుడిగోడల మీద ఆ శిల్పకళ చూడండి... మన శిల్పులు కూడా తక్కువ వాళ్లు కాదండోయ్... పూజారి గారూ! రతి కళలో సిద్ధ హస్తుల్లా ఉన్నారు... ఎంత నైపుణ్యంగా చెక్కారండి... ఆ కళలో ప్రక్రియల్ని...''

''పవిత్రమైన సృష్టి కార్యం నాయనా అది! అది లేనిదే నువ్వులేవు... నేను లేను... అసలీ సృష్టే లేదు... అన్నట్టు... ఏవో సందేహాలున్నాయీ అడుగుతానన్నావ్?''

''అడక్కుండానే చాలావరకు క్లియరైపోయాయిలెండి... అయినా... ఒక్కటి... వక్షోవిహారిణీ... కుచ చూచుక, కాంతాకుచాంబరుహ...స్తనా వివశీనోరమ్యతాయ్... మొదలైన పదాలన్నీ స్త్రీ యొక్క వక్షద్వయాన్నే సూచిస్తున్నాయ్ కదా... దేవుడ్ని స్తోత్రించేప్పుడు అలా స్త్రీ దేహాభాగాల్ని స్మరించాల్సిందేనా?''


''ప్రకృతీ, పురుషుడూ ఒకరిలో ఒకరు అంతర్లీనాలు.... సృష్టికే మూలకారణమైన స్త్రీని – జ్ఞాపకం చేసుకోకుండా, పురుషుడ్ని కీర్తించడం మన సంప్రదాయం కాదు నాయనా... భగవంతుని నామ స్మరణంలోనే స్త్రీ ఇమిడిపోయి ఉందయ్యా! సీతారాములూ, రాధాకృష్ణులూ, రతీ మన్మథులూ...''

# Story

పూజారి మాటల్ని మధ్యలో కట్ చేస్తూ అన్నాడు ''ఎంతయినా మన సంప్రదాయం సెక్స్‌కి పురాణ కాలంలో పట్టం కట్టింది...''

''సెక్సా?'' అదిరిపోయి చూశాడు పూజారి.

''భాష మారినంత మాత్రాన అదిరిపోతారెందుకండీ? సెక్స్ అంటే శృంగారమే! ఇంకేం కాదు... దాదాపు మన దేవుళ్లందరూ... శృంగార పురుషులే! శ్రీనివాసునికి ఇద్దరు, పరమ శివునికి ఇద్దరు, కృష్ణ పరమాత్మునికైతే ఇక చెప్పనే అక్కర్లేదు... ఎనిమిది మంది రాణులు కాక... పదహారు వేల మంది గర్ల్ ఫ్రెండ్స్... మీ భాషలో అయితే గోపికలు..''



కాసేపాగి మళ్లీ మనోహర్ అన్నాడు.

''ఇప్పుడు ఇద్దరు భార్యలుంటే కేసు! గర్ల్‌ఫ్రెండ్‌ని వెంట తిప్పుకుంటే ఎగతాళి... శృంగారం గురించి మాట్లాడితే ఏవగింపు.... ఆ సాహిత్యం చదవటం నేరం. అటువంటి బొమ్మలు చూడడం పాపం... ఆనాటి కవులు, శిల్పులూ మళ్లీ పుడితే ఎంత బాగుంటుందో... అసలు నన్నడిగితే పూజారిగారూ....''

మాట్లాడుతూ మాట్లాడుతూ అలాగే నోరు తెరచుకుని చూస్తుండి పోయాడు మనోహర్.

గుడి గోడ మీది శిల్పాల్లో – ఓ మనోజ్ఞమూర్తి ప్రాణం పోసుకుంది.

వెండి పట్టీలు ఘల్లుఘల్లుమనిపించుకుంటూ తమ వైపే నడిచి వస్తోంది.

ఆమె నడుస్తుంటే... సమున్నత స్తనద్వయం లయబద్ధంగా కదులుతూ – సమ్మోహనరాగం పాడుతోంది''.

ఆమె జఘనభాగం ఊగిపోతూ శృంగార లాస్యం చేస్తోంది.

చిత్రంగా – ఆమె పూజారికి చేరువగా వచ్చి నిల్చుంది.

మంత్ర కవాటాల్లాంటి నయనాలను రెపరెపలాడించి,... రసికత వూరిపోతున్న పెదవుల్ని కదిలించి అంది –

''నాన్నగారూ! పెద్ద మామయ్యా, దుర్గత్తయ్య వచ్చారు... అమ్మ నిన్ను త్వరగా అర్చన ముగించుకుని రమ్మంది...''

''అయిపోయింది తల్లీ... పద వెళదాం... వస్తాన్నాయానా... రేపు మాట్లాడుకుందాంలే...''

అరె! ఈమె గోడ మీ ప్రతిమ కాదా!

ఈ రసాధి దేవత పూజారి కూతురా!

వాటె వండర్...

తను గుడికొచ్చిన వేళ చాలా గొప్పది.

***

ఆ రోజు గుడి మెట్ల కిందే కాపు కాశాడు మనోహర్.

చాలా సేపటి తర్వాత పూజారిగారమ్మాయి మెట్లు దిగుతూ కనిపించింది.

పరికిణీకున్న సరిగంచు కింద నుండీ పచ్చగా మెరుస్తూ కనిపిస్తున్న – తమలపాకు పాదాల్ని అనుసరిస్తూ – ఆమె వెనక నడవటం మొదలెట్టాడు.

''రాత్రి వాత్స్యాయనుడు కలలో కొచ్చాడండీ...'' మనోహర్ మాటకు –

ఆమె చివుక్కున వెనుతిరిగి చూసింది.

''శాంభవి గారబ్బాయినండీ... నా పేరు మనోహర్...''

''ఓహో...'' అనుకుంది ఆమె – పూజారి కుటుంబానికి శాంభవి చిరపరచితురాలే!

''ఆయనెవరండీ?'' నవ్వుతూ అడిగింది.

''ఓ రచయితండీ... కామశాస్త్రాన్ని రాసిందాయనే... అంతేకాదు... కామకళ రక్తి కట్టించడానికి విలక్షణమైన సూత్రాల్ని ప్రతిపాదించిన శాస్త్రజ్ఞుడు కూడా! ఆయన రచనను నేను క్షుణ్ణంగా చదివానండీ... థియరీ బాగా తెలుసు... మీ మా ఇంట్లో వాళ్లు సమ్మతిస్తే ప్రాక్టికల్స్ చెయ్యాలని చూస్తున్నాను.. అన్నట్టు మీ పేరు...?''

''రతి''

''ఆహాc... మీ రూపంలోనే కాదు. పేరులో కూడా శృంగారమే! అసలు.. మీ పేరుకు అర్థం మీకు తెలుసాండీ?''

ఏమిటన్నట్లు చూసింది.

''అది మాటల్లో చెప్పటం సభ్యతగా ఉండదు.. చేతల్లో అయితే చాలాగొప్పగా వుంటుంది... చెప్పమంటారా?''

ఆమె ఏం మాట్లాడలేదు... ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ, నిదానంగా నడక సాగింది.

''రతి సుఖ సారే...'' అంటూ ఈల వేస్తూ ఆమెతో పాటే నడుస్తున్నాడు మనోహర్.

అతనలా ఈలవేస్తూ నడవటం ఆమెకు నచ్చలేదు... కళ్లు చిట్లించి

చూసింది మనోహర్ వైపు.

అతను టక్కున ఆపేశాడు ఈలని.

''రతి గారూ!''

''ఆc!''

''కాసేపు ఇలా చెట్టు కింద కూర్చుందామా?''

గుడికీ, పూజారి ఇంటికి మధ్య దారి నిర్మానుష్యంగా వుంటుంది... ఒక రకంగా అడవి బాటలా తోస్తుంది.

ఆమె క్షణం తటపటాయించింది. మళ్లీ ఏమనుకుందో ఏమో అటు ఇటు చూసి దారి పక్కగా వున్న ఓ రాతి మీద కూర్చుంది. ఓ కాలు ముందుకు చాపి, మరో కాలు దాని మీద సగానికి మడిచి, మోకాలి మీద మోచేయి ఆనించి - అరచేతిని చెంపకు చేర్చి అతన్ని చూస్తూ అడిగింది... ''చెప్పండి?''

మనోహర్‌కి ఆమె గుడి గోడ మీది శిల్పంలా అనిపించింది. రక్తం సలసలమంది. నరాలు జివ్వుమన్నాయ్. తమాయించుకుని ఆమెకు కాస్త దూరంలో కూర్చున్నాడు.

''మీ నాన్నగారు అందరి పూజార్లలాంటి ఛాందసుడు కాదండీ! శృంగారం గురించి ఎంత గొప్పగా చెప్పారో..''

తండ్రిని మెచ్చుకోగానే ఆమెకెందుకో సంతోషంగా అనిపించి, చిన్నగా నవ్వింది.

అవునా - అన్నట్టుగా కళ్లు రెపరెపలాడించింది.

''ప్రకృతీ - పురుషుడూ ఒక దానిలో ఒకటి అంతర్లీనాలట... అంటే - స్త్రీ, పురుషుల మధ్య సెక్స్ అని వార్యం అనేగా! సెక్స్‌లో దైవత్వముందట! సైన్స్ తప్పు కాదనేగా వారి భావం! అది పవిత్రమైనది కాబట్టే గుడి గోడల మీద సెక్స్ ప్రొఫైల్స్ చెక్కారట. ఆనాటి శిల్పులు...'' అని కాసేపాగి ''ఇది కూడా మీనాన్నే చెప్పారు... మన పురాణశ్లోకాలు ఏవి తీసుకున్నా అందులో సెక్స్ ఇంటర్నల్‌గా వుంటూనే వుంటుందట..'

చప్పున చెవులు మూసుకుంది రతి.

''మా నాన్న ఒక్కనాటికీ అలా చెప్పరు.... మీరు పొరపాటుగా విని వుంటారు.. భార్యలో కూడా విడి సమయాల్లో తల్లిని చూసే మనిషాయన..''

''విడి సమయాల్లో... అంటే ... '' మనోహర్ గుబుక్కున అనేసి, ఫక్కున నవ్వాడు.

రతి చురచుర చూసింది.

''సరే... కోప్పడకండీ... ఒక చిన్న ఎగ్జాంపుల్... నీ పేరు ఏమిటన్నారు?'' నవ్వటం ఆపి అడిగాడు.

''చెప్పాగా... రతి...''

''రతి అంటే ఏమిటో తెలియదు కదూ నీకు? సెక్స్! కన్నకూతురి పేరులో కూడా సెక్స్‌ని ఇమిడ్చి పెట్టుకున్నాడాయన... అంటే... ఎంత ప్రోగ్రెసివో ఆలోచించు... మరీ ఆయన నాకలాగే చెప్పి వుంటారని ఇప్పటికైనా నమ్ముతావా?'' ఆమె మీదకు వంగి అల్లరిగా, కొంచెం ఆవేశంగా అన్నాడు మనోహర్.

అతడి వెచ్చటి ఉచ్ఛ్వాసనిశ్వాసాలకు తనముఖం వేడిగా అయిపోతుంటే - వెనక్కి జరిగిందామె.

''జరక్కు! నీ పేరులోని అర్థాన్ని అనుభవించి తెలుసుకో..'' అతను అధాట్టుగా ఆమెను తనకేసి అదుముకుంటూ చెప్పాడు. ''ఫెంటాస్టిక్... సుప్రభాత శ్లోకాల నిండా వీటి గురించిన వర్ణనలే...''

ఆమె సుడిగాలిలో చిగురుటాకులా వణికిపోతూ అంది ''మా నాన్నగారు ఇటే వస్తారు. నీ ప్రాణం తీసేస్తారు...'' ఆమె గొంతు కంపిస్తోంది.

''మీ నాన్న ఏమీ అనడు... చెప్పాగా... శృంగారంలోని గొప్పతనం ఆయనకు తెలిసినంతగా ఇంకెవరికీ తెలియదు... గుడిమీది రతిభంగిమల్ని రోజూ చూసి తరించిపోవడానికే ఆయన పూజారిగా మారాడు... ఇక మాట్లాడకు...'' అంటూనే రతి మీదకు పూర్తిగా వంగి తేనెలో మాగిన చెర్రీస్‌లా ఉన్న ఆమె పెదవుల్ని ఆత్రంగా అందుకోబోయాడు.

ముఖం గిరుక్కున పక్కకు తిప్పుకుంది. పల్చటి ఆమె నడుం మీద చేత్తో అదమసాగాడు.

నరనరాల్లోని శక్తినంతటినీ కూడ గట్టుకుని - అతన్ని ఒక్క తోపు తోసింది రతి.

అల్లంత దూరంలో వెల్లకిలా పడ్డాడు మనోహర్.

ఒక్క ఉదుటున లేచి - గస పెట్టుకుంటూ తిరిగి చూడకుండా పరిగెత్తిపోయింది రతి.

***

''శృంగారం గురించి మీరు చెప్పిన విషయాల్ని - బాగా ఆలోచించి, అర్థం చేసుకున్నాను. ఈ రోజు సాయంత్రం ఆరుపైన మా ఇంటికి రండి... అమ్మా, నాన్నా ఊరెళ్లారు...''

సిగ్గు సిగ్గుగా రతి అలా చెప్పి వెళుతుంటే - మనోహర్ చిత్తరువులా నిలబడిపోయాడు.

గుమ్మానికి అల్లుకున్న జాజిపందిరి విరగబూసి వుంది. కమ్మని వాసనలు ఆ ప్రదేశమంతా వ్యాపించి వున్నాయ్. మత్తుగా ఒళ్లు విరుచుకుని, తెరచి వున్న తలుపు మీద రెండు సార్లు తట్టాడు మనోహర్.

చాలాసేపటిగ్గాని - చలనం రాలేదతనిలో - గిల్లి చూసుకున్నాడు - కలకాదు - నిజమే!

''మనోహరా! ఫరవాలేదురా! ఒక కన్నె మనసుని హరించ గలిగావ్... నీ జన్మ ధన్యం...''

ఇంటికి వచ్చాడన్న మాటే గానీ - అనీజీగా ఉన్నాడు... ఏం చేయాలో తోచక - కాలుగాలిన పిల్లిలా అటు ఇటు తిరిగాడు... పడుకున్నాడు... కూర్చున్నాడు... నిల్చున్నాడు... ఎప్పుడెప్పుడు సాయంత్రం ఆరవుతుందా అని నిమిషాలు లెక్క పెట్టసాగాడు.

గిలిగింతలు పెట్టినట్లుగా - గడియారం ఆరు కొట్టింది.

చెంగునలేచి సైకిల్ మీద బయల్దేరాడు. ఆఘమేఘాల మీద పూజారిల్లు చేరుకున్నాడు.

అప్పటికి మునిమాపు చీకట్లు ముసురుకుంటున్నాయ్.

పూజారింట్లో దీపం వెలుగుతోంది. గుమ్మానికి అల్లుకున్న జాజిపందిరి విరగబూసి వుంది. కమ్మని వాసనలు ఆ ప్రదేశమంతా వ్యాపించి వున్నాయ్.

మత్తుగా ఒళ్లు విరుచుకుని, తెరచి వున్న తలుపు మీద రెండు సార్లు తట్టాడు మనోహర్.

''రండి...''

రతి కాబోలు ఆహ్వానించింది.

అతని అడుగులు గాలిలో తేలిపోతున్నాయ్... గడప దాటి లోపలికి నడిచాడు.

లోపలికి పడిన అడుగు భూమిలోకి దిగ్గొట్టిన రాటలా బిగుసుకు పోయింది.

''ఆంటీ...'' అనబోయాడు గానీ - గొంతు పెగిలి రాలేదు.

రతి వాళ్ల అమ్మ - బాలాత్రిపుర సుందరి పేలవంగా నవ్వింది.

''ఆంటినైతే ఏం బాబూ? నేనో స్త్రీని, నువ్వో పురుషుడివి... శృంగారం పరమ పవిత్రం... రా... కానివ్వు...''

''ఆంటీ...'' గట్టిగా చెవులు మూసుకున్నాడతను.

''నువ్వు రోజూ దేవుడి ముందు చేతులు జోడించి, వల్లించే శ్లోకాల్లోని స్త్రీమూర్తి జగజ్జనని! స్తోత్ర పాదంలోని వర్ణనల్ని కాముక దృష్టితో చూసిన నువ్వు... నన్నెందుకు అలాగే చూడకూడదు... అచ్ఛాదన లేని నా వక్షస్థలం మీద నువ్వు తలపెట్టి పడుకుంటావా... రా... ఇప్పుడే సిద్ధం చేస్తాను...''

మనోహర్ తల గిర్రున తిరిగింది... కళ్లలో నీళ్లు సుడులు తిరగ సాగాయ్.

''అలాగే కారిపోనీ ఆ కన్నీళ్లను... నీ కళ్లకు అడ్డుగా వున్న కామపు పొరలు కరిగి పోయే దాకా - మాలిన్యం పూర్తిగా తొలగిపోయాక... నిర్మలమైన కళ్లతో, నిదానంగా చూడు... గుడిగోడల మీది రతి భంగిమల్ని... అప్పుడు తెలుస్తుంది... ఆ శృంగారంలోని పరమార్థం... అంతరార్థం..... శృంగారం దైవదత్తం అన్న పూజారి గారి మాటల కర్థం.. రతిని నువ్వు చెప్పింది కాదు... నేను చెబుతా విను.. శ్రీకృష్ణుడు భగవత్ శక్తికి సంకేతం... మైమరచి అతన్ని అల్లుకుపోయిన రాధ సకల భక్త కోటికి ఆనవాలు... అరమోడ్చిన ఆమె కళ్లలోని పారవశ్యం... కేవలం భగవంతునికీ భక్తునికీ అను సంధానమైన నిదర్శనం...

ఆమె కాసేపు ఆగింది.

మనోహర్ చెక్కిన శిల్పంలాగా నిల్చుండి పోయాడు.

''కృష్ణుని చేతిలోని వేణువు - దేవదేవుని పిలుపుకి చిహ్నం... ఆ పిలుపుకి మైమరచి ఆయన్ను చుట్టుముట్టిన గోపికలు... యావత్‌ప్రపంచానికీ ప్రతీకలు... వారి శరీరం మీద నుండి జారిపోతున్న వలువలు మనకిచ్చే సందేశం ఏమిటో తెలుసా? ఈ దేహం మాయ... భగవంతుడొక్కడే నిజం! కనుక మీలోని మదమాత్సర్యాలను ఇలా జార్చివేయండి... భగవంతునిలో ఐక్యంకండి...'' బాలాత్రిపుర సుందరి ఒక్క క్షణం ఆగింది మళ్లీ.

''ఇప్పుడు చెప్పు... భార్యలో తల్లి లేదూ? మన సంప్రదాయం ఎంత గొప్పదో ఇప్పటికైనా అర్థమైందా? కన్న కూతురికి పేరు పెట్టడంలో - ఆ తండ్రి సెక్స్ గమనించాడా?'' మనోహర్ ఆమె కళ్లలోకి తదేకంగా చూశాడు. తిరిగి ఆమె వెనకగా నిలబడి, తననే గమనిస్తున్న రతికేసి చూశాడు. అనూహ్యంగా వెళ్లి బాలా త్రిపురసుందరి కాళ్ల మీద పడ్డాడు... లేచి, రతి ముందు నిలబడి రెండు చేతులూ జోడించాడు.

ఇప్పుడతనికి రతిలో సెక్సీనెస్ కనిపించటం లేదు... కేవలం పవిత్రత తప్ప!

*

చిరునామా:
**కోలపల్లి ఈశ్వర్,**
**3-1-85**, మేడ మీద, రెండవ పోలీసు స్టేషన్ ప్రక్కన,
నవాబుపేట, నెల్లూరు - **524 002**